నావూరు రహదారికి గ్రీన్ సిగ్నల్

- ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం
- రోడ్ల ఆధునికీకరణకు నిధుల వెల్లువ
- పెద్దవాగుపై పూర్తిస్థాయిలో బ్రిడ్జి

పొదలకూరు : మండలంలో నావూరు రోడ్డు ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ పనులను వేగంగా చేపట్టి మరో రెండు మాసాల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా దెబ్బతిన్న రోడ్డుకు గతంలో తాత్కాలిక మరమ్మతులే చేపట్టారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు పెద్దవాగు పొంగి ప్రవహించి నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, కొండలరాయుడకండ్రిక తదితర గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించేవి. రోడ్డు నిర్మాణ పనులు, బ్రిడ్జి పనులు పూర్తయితే గ్రామాల మధ్య సుఖవంతమైన ప్రయాణం ఉంటుంది. దీనిని పూర్తి చేసేందుకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారు.

రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.14.45 కోట్లు

సంగం–పొదలకూరు మెయిన్ రోడ్డు 11.64 కి.మీ వద్ద నుంచి వయా ప్రభగిరిపట్నం, నావూరు, చెన్నారెడ్డిపల్లి, కొండలరాయుడుకండ్రిక వరకు 23 కి.మీ మేర రూ.10.83 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. మార్గమధ్యలో నావూరు వద్ద పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్ల నిధులు విడుదల చేశారు. బ్రిడ్జి నిర్మాణం ఈ ప్రాంతవాసుల కలగా మిగిలిపోయింది. తుఫాన్లు, వరదలు వస్తే నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, కొండలరాయుడు కండ్రిక గ్రామాలతో బయటి ప్రపంచానికి సంబంధాలు తెగిపోతుంటాయి. దీంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా అప్పటి టీడీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ఇప్పుడు మంత్రి హోదాలో నిధులు సాధించగలిగారు. దీంతో మండలంలో దాదాపుగా రోడ్లలన్నీ బాగుపడినట్లు అవుతుంది.


నావూరు పెద్దవాగు చప్టా


రోడ్డు, బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కాకాణి


దెబ్బతిన్న నావూరు రోడ్డు

కల నెరవేరింది



ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపడుతుండడం మంచి పరిణామం. ప్రభుత్వం నిధులు విడుదల చేయడం, మంత్రి కాకాణి కృషి ఫలితంగా బ్రిడ్జి నిర్మాణ పనులకు మోక్షం లభించింది. ఎప్పటి నుంచో చెప్తా ఉన్నా వర్షాకాలంలో వాగు పొంగి ప్రవహించేది. ఇక ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.

– వి.నరసింహారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నావూరు రోడ్డు బాగా దెబ్బతినడం వల్ల రాకపోకలు కష్టంగా ఉండేది. రోడ్డు పనులు ప్రారంభించడం శుభ పరిణామం. ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలు రుణపడి ఉంటాం. మంత్రి కాకాణికి కృతజ్ఞతలు.

– సీహెచ్ రమేష్, నావూరుపల్లి

త్వరలో పూర్తి చేస్తాం

పనులను వెంటనే ప్రారంభించి త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం. అయ్యగారి పాళెం మీదుగా ఇటీవల అమ్మవారిపాళెం వరకు ఏఎంసీ నిధులతో రోడ్డు పనులు పూర్తి చేశాం. రెండు మాసాల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

– మవేక్‌రెడ్డి, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ

క్లుప్తంగా

నేడు పంటపాళేనికి మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఉదయం పంటపాళెం గ్రామానికి వస్తారని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత మారు సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం సుబ్బారెడ్డి పాళెంలో నిర్మించిన గోడౌన్‌ను ప్రారంభిస్తారు.

మనుబోలులో

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం మనుబోలుకు రానున్నారు. సాయంత్రం 5 గంటలకు మనుబోలు బస్టాండ్ సెంటర్‌లో మంత్రి కాకాణి సమక్షంలో పలువురు నాయకులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలని కోరారు.

కొత్తూరులో వలంటీర్లకు వందనం నేడు

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఏపీఎల్‌డీపీ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మందకృష్ణ మాదిగ పర్యటనకు తరలిరావాలి

పొదలకూరు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఈనెల 26వ తేదీన కావలి పర్యటనకు వస్తున్నారని, మాదిగ సోదరులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. పొదలకూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా మందకృష్ణ మాదిగ కావలి విచ్చేస్తున్నట్లు వెల్లడించారు. కావలిలోని గోపాలకృష్ణ కల్యాణ మండపంలో మధ్యాహ్నం సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి అధ్యక్షుడు చిడదల శ్రీనివాస్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

మనుబోలు : స్థానిక దళితవాడలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నేత పూల చంద్రశేఖర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. అర్హులను లబ్ధిదారులుగా చేర్చాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 48 / 1, 2 కోటమిట్ట, 48 / 3 చిన్నబజార్, 49 / 2 రామిరెడ్డివీధి వార్డు సచివాలయాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పేదలందరికీ గృహాలు కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్, హాజరు, స్పందన రిజిస్టర్లు తదితరాలను పరిశీలించారు.

గణపతి దేవస్థాన నిర్మాణానికి భూమి పూజ



నెల్లూరు(బారకాసు): బీవీనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయ సమీపంలో లక్ష్మీ గణపతి దేవస్థాన నిర్మాణానికి భూమి పూజను శనివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దర్భా అనిల్‌శర్మ, అవధానం రామ్మోహన్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. వ్యాపారవేత్త మొయిళ్ల మల్లికార్జునరెడ్డి, తేజస్విని దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గౌరి, మల్లికార్జునరెడ్డి, దశయ్య, రంగయ్యానాయుడు, కృష్ణారెడ్డి, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు

మనుబోలు : మండల పరిధిలోని మనుబోలు–చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న వెంకయ్య స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు క్షీర, పంచామృతాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల మధ్య విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

సంగమేశ్వరస్వామికి..

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని కండలేరు ఒడ్డున వెలసిన కామాక్షితాయి సమేత సంగమేశ్వర స్వామికి అర్చకుడు ఫణీంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలి

ముత్తుకూరు : ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ముత్తుకూరు మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నినదించారు. మండలంలోని తాళ్లపూడిలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ రెండో రోజున విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు శ్రీవిద్య, త్రివేణి ఆధ్వర్యంలో పర్యావరణాన్ని కాపాడాలి–ప్లాస్టిక్‌ను నిషేధించాలి అంటూ ప్రతి వీధిలో నినాదాలు చేశారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను ఏరివేసే కార్యక్రమం నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకళాశాల విద్యార్థులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ముత్తుకూరు : మండల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై మండల పరిషత్ కార్యాలయం వద్ద 16వ విడత సామాజిక తనిఖీ శనివారం నిర్వహించారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, హౌసింగ్ తదితర శాఖల ద్వారా జరిగిన పనులపై ప్రజా వేదిక జరిపారు. 2022–23 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.3.75 కోట్ల మేరకు పనులు జరిగాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా సుమారు రూ.8 కోట్ల మేరకు పనులు చేశారు. డ్వామా పీడీ వెంకట్రావు, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ వేణుగోపాల్, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, విజిలెన్స్ అధికారి సూర్యమోహన్, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ ఏవీఎస్ మూర్తి తదితరులు వీటిపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రూ.10,400ల రికవరీకి సిఫార్సు చేశారు. ఎంపీడీఓ లక్ష్మణకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రఘు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.



బాల్య వివాహాలతో అనర్థాలు

తోటపల్లిగూడూరు : మండలంలోని పలు ప్రాంతాల్లో ఇందుకూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కళాజాత బృంద సభ్యులు శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కోడూరు పంచాయతీ ముక్కంటమ్మ గిరిజన కాలనీ, కోనేటితోపు, వరిగొండ, మల్లికార్జునపురం, కొలిదిబ్బ తదితర గిరిజన కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు జరిగాయి. 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయకూడదని, బాలికలను చదివించాలని, గుడ్ టచ్– బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు రంగమ్మ, విజయలక్ష్మి, కళాజాత సిబ్బంది చిరంజీవి, రవితేజ, శారద, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కామాక్షితాయికి ప్రత్యేక పూజలు


కామాక్షితాయి అమ్మవారి గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి వ్యాస పూర్ణిమ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ గిరికృష్ణ, ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

డాక్టర్ కణ్ణన్‌కు అవార్డు



నెల్లూరు సిటీ: నారాయణ డెంటల్ కళాశాల.. హాస్పిటల్ ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ కణ్ణన్ డాక్టర్ ఎస్‌ఎల్ బాలీ మెమోరియల్ అవార్డును శనివారం అందుకున్నారు. ఇంటర్నేషనల్ కాలేజీ ఆఫ్ డెంటిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్వొకేషన్ అండ్ అవార్డుల కార్యక్రమంలో గురుగోవింద్‌సింగ్ ఇంద్రప్రస్థ వర్సిటీ, ఢిల్లీ వారు ప్రదానం చేశారు.

సిద్ధి విఘ్నేశ్వరాలయంలో పూజలు రేపు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ద్వారకానాథ్ తదితరులు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని సిద్ధి విఘ్నేశ్వరాలయంలో స్వర్ణకవచ అలంకార మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నామని నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 1800 కిలోల పుష్పాలతో పుష్పయాగాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు మాచవోలు కోటేశ్వర శర్మ, పాండురంగ అన్నదాన సమాజ కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బాలాజీ, ఆలయ చైర్మన్ బయ్యా ప్రసాద్, కమిటీ సభ్యులు అనిల్‌కుమార్, వెంకటసురేష్‌బాబు, లీలామోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. కంచి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. ఉభయకర్తలుగా పైడిపాటి విజయసారథి దంపతులు వ్యవహరించారు. మఠం మేనేజర్ కొ్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొన్నారు.

నేత్రదానం

నెల్లూరు సిటీ: జేమ్స్‌గార్డెన్‌లో నివాసం ఉంటున్న జయంతి (52) గుండెపోటుతో శనివారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జీజీహెచ్ నేత్రదాన కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సరస్వతి పూజ



వెంకటాచలం : మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో సరస్వతి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. బాల్యవివాహాల నివారణపై చైతన్యం కలిగించేలా లఘు దృశ్య నాటిక అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎంఈఓ మధుసూదన్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమంలో నిడిగుంట పాళెం, గుడ్లూరువారిపాళెం, ఇస్కపాళెం పాఠశాలల హెచ్‌ఎంలు చలపతి, వెంకటరమణ, పార్వతీశం, విద్యాకమిటీ చైర్‌పర్సన్ మౌనిక, ఉపాధ్యాయులు మాధవ్, కవిత పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో.

పొదలకూరు : స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం సరస్వతి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు హాల్ టికెట్లు, ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులు సాధించాల్సిందిగా సూచించారు. కరెస్పాండెంట్లు సుధాకర్‌రెడ్డి, నారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ ఎ.సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతానికి కృషి చేయాలి

కొడవలూరు : మార్చి 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమ విజయవంతానికి వైద్యారోగ్య శాఖ, ఐసీడీఎస్ సిబ్బంది సమైక్యంగా కృషి చేయాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు కోరారు. స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో పల్స్‌పోలియో నిర్వహణపై వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైరిస్క్ ఏరియాలను ఇప్పటికే గుర్తించినట్లు వివరించారు. వీటిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం పూర్తి చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 2,436 మందికి పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా కేటాయించినట్లు వివరించారు. ఇందుకోసం మూడు రూట్లలో 32 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఒక మొబైల్ బూత్ కూడా ఏర్పాటు చేసినందున వీరు హైరిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, తాత్కాలిక గుడారాలు, రైల్వేస్టేషన్ల వద్ద ఉంటున్న వారిపై దృష్టి పెట్టాలని సూచించారు. వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది పరస్పర సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టి.నాగభూషణమ్మ, ఎస్.నిర్మల, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

క్షయరహిత గ్రామంగా కనుపర్తి

పొదలకూరు : క్షయరహిత గ్రామంగా కనుపర్తి గుర్తింపు తెచ్చుకుందని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. మండలంలోని కనుపర్తి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించి క్షయ వ్యాధి నివారణ చర్యలపై వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రెండేళ్లుగా ఒక్క టీబీ కేసు కూడా నమోదు కాలేదని వెల్లడించారు. కనుపర్తి గ్రామాన్ని క్షయరహిత గ్రామంగా ప్రకటించేందుకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖకు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది అందుకు కృషి చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం ఏఎన్‌ఎం వద్దనున్న రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీఎస్ఆర్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఖాదర్‌వలి, వైద్యాధికారి కిరణ్‌రిషిత, విస్తరణాధికారి రవికుమార్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పొదలకూరు : సంగం–పొదలకూరు మార్గంలో తోడేరు క్రాస్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన మలిరెడ్డి విష్ణు కిసాన్‌క్రాఫ్ట్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఎప్పటిలానే శనివారం విధులు ముగించుకుని బైక్‌పై వస్తుండగా తోడేరు క్రాస్ వద్ద ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో విష్ణు గాయపడగా ఆటో బోల్తా పడింది. క్షతగాత్రుడిని పొదలకూరు సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రోడ్డుపై బోల్తా పడిన ఆటో

వైభవంగా పల్లకిసేవ

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి అమ్మవార్ల పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వాకాటి శ్రీనివాసులురెడ్డి–సంధ్య దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

లబ్ధిదారులకు గృహాలను స్వాధీనం చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు లబ్ధిదారుడి భాగస్వామ్య మొత్తాన్ని చెల్లించి, గృహాలను స్వాధీనం చేసేలా యజమానులకు అవగాహన కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. వెంకటేశ్వరపురంలోని జగనన్న కాలనీలో నిర్మాణాల పురోగతిపై మెప్మా, హౌసింగ్ విభాగం, నగరపాలక సంస్థ హౌసింగ్ అమెనిటీస్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మాణ పనులు పూర్తయిన గృహాలను త్వరితగతిన అందజేసేందుకు గానూ లబ్ధిదారుల వాటా వసూలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అదనపు కమిషనర్ శర్మద, మెప్మా పీడీ రవీంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ నాగరాజు, ఈఈ దయాకర్ పాల్గొన్నారు.

ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు

నగరపాలక సంస్థలో హెల్త్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు గిరీష్‌కుమార్, ఈశ్వరయ్య, మహబూబ్ షరీఫ్‌కు ఉత్తర్వులను కమిషనర్ వికాస్ మర్మత్ అందజేశారు. కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.